స్వస్థానం

పల్లె, పేట, బస్తీ, పట్నం, నగరం అంటూ కొన్ని పదాలు వాడుకలో ఉన్నాయి. సరే! ఏది పల్లె? ఏది పేట? బస్తీ అంటే ఎలాంటిది? దేన్ని పట్నం అనాలి? ఎలాంటి పట్నం నగరంగా పేర్కొనబడుతుంది? అన్న విషయాలపైన స్పష్టంగా నిర్వచనాలు జరిగినట్టులేదు. ఇందుపైన ఎవడి వూహ వాడికి ప్రమాణంగా ఉన్నట్టు తోస్తుంది. నా ఊహ పారినంతలో నరహరిపేట నిజంగా పేటగాదు, దాన్ని చిన్న బస్తీ అనవచ్చు. ఊరి నడుమ పెద్ద రోడ్డుకు సమాంతరంగా తూర్పు దిక్కున రైల్వే స్టేషన్ కానవస్తుంది. స్టేషను కటువైపున వున్నవన్నీ రైల్వే సిబ్బంది తాలూకు నివాసగృహాలు. అందువల్ల నరహరిపేట వ్యాపించి వుండడమంతా రోడ్డుకు పడమటి వైపున్నే! ఆ వూరినింత బాగా సర్వే చేసే అవసరం నాకేమి వచ్చిందని ఎవరికైనా సందేహం కలగవచ్చు బాబూ! ఆ మాటే చెబుతున్నాను. వాడలుగా, వీధులుగా, సందులుగా, గొందులుగా ఒక చదరపు కిలోమీటరు పర్యంతం విస్తరిల్లి వున్న నరహరిపేటలో అప్పుడు నేనొక అద్దె యింటి కోసం అన్వేషిస్తూ నా తంటాలు నేను పడుతున్నాను.

ఆఫీసు పని ముగిసిన సాయంకాలాల్లో నేను సాగించిన అన్వేషణకు ఫలితంగా 'అద్దె యిల్లు' అన్న విషయంపైన ఒక 'తీసిస్' వ్రాయడానికి కావలసినంత సరంజామా నాకు లభించింది.

ఒకటి: ఖాళీ యిళ్ళన్నీ అద్దె కివ్వబడవు.

రెండు: అద్దె కివ్వబడే ఖాళీ యిళ్ళన్నీ నివాసయోగ్యాలు గావు.

మూడు: నివాసయోగ్యమై వుండి అద్దెకివ్వబడే ప్రతీ ఖాళీయిల్లూ అద్దె రేటు దృష్ట్యా మన కందుబాటులో వుంటుందన్న నమ్మకం లేదు.

నా నెలజీతం రెండువందల యాభై రూపాయలు. నే నిచ్చుకోగలిగిన ఇంటి అద్దె అందులో పదోవంతు. కాదంటే అవసరాన్ని బట్టి ఇంకొక అయిదు రూపాయలు ఎక్కువ.

ఈ హద్దుకు కట్టుబడినట్టుగా నరహరిపేటలో నా దృష్టికానినవి రెండంటే రెండే యిళ్ళు.

పరిశీలన మాత్రమే మన వంతు. ఎన్నిక చేయవలసిన వ్యక్తిని నేను కాను. ఆ వ్యక్తి పేరు నీరజ. ఎవరో కాదులెండి, సాక్షాత్తుగా మా యింటావిడ.

కానుపు కోసం పుట్టింటికి వెళ్ళివున్న మా ఆవిడకు నా అభిప్రాయాల సారాంశాన్ని ఎంతో సిన్సియర్‌గా ఒక నివేదిక రూపంలో సబ్‌మిట్ చేశాను.

"ప్రియమైన నీరజకు శుభాశీస్సులు!

నేనిక్కడ అదే, నరహరిపేటలో ఇప్పటివరకూ క్షేమంగా వున్నాను. ఇక్కడి భీమా భోజనశాలలో యింకొక వారం రోజులు వరుసగా భోజనం చేసినట్టయితే నేను క్షేమంగా వుండగలనన్న నమ్మకం లేదు. నెలరోజులపాటు భీమా భోజనశాలలో భోజనం చేయదలచుకున్నవారు ముందుగా తమ జీవితాన్ని భీమా చేసిన తరువాతగానీ అలాంటి సాహసానికి పూనుకోరట! చూచావా, అదీ విషయం!

అందువల్ల నువ్వు నీ పుట్టింటి పారడైజ్ నుంచి ఈ నరహరిపేటకు రాకతప్పదు. జననియు, జన్మభూమియూ స్వర్గముకన్నా ఎంతగా ఎక్కువే అయినప్పటికీ, మొగుడన్నవాడు సైతం పూర్తిగా నిరాదరణీయుడు కాదుగదా! ('వాట్ ఎ పిటి మై కంట్రీ ఉమెన్!)

నువ్వు, నేను, మన చిరంజీవులిద్దరు వెరశీ మన నలుగురికి కావలసిన సదుపాయాలను నిగాలో పెట్టుకొని అప్రమత్తుడినై నేను అద్దె యిళ్ళవేట కొనసాగించాను. ఈ ప్రయత్నంలో కృతకృత్యుణ్ణి కాగలిగానని తెలుపుకోడానికి ఎంతో ఆనందిస్తున్నాను.

నేను వెదికి పట్టిన రెండు ఇళ్ళల్లోనూ నీ అభిరుచులకు ఏది నచ్చుతుందో నాకు తెలియకుండా వుంది.

ఈ రెండు యిళ్ళూ ఒకదాని కొకటి అరమైలు దూరంలో వున్నాయి. పరిసరాల్ని బట్టి, పరిస్థితులనుబట్టి ఈ రెండు యిళ్ళకున్న అంతరం అంతకంటే విస్తృతమైనది. ఏలాగంటావా, అవధరించు.

ఒక యిల్లు ఊరికి దక్షిణపు వైపు కొసలో వుంది. ఆ వాడ పేరు అశోకపురం. పేరు పెట్టడంలోని సదుద్దేశం ఇంకా కార్యాచరణలోకి వచ్చినట్లు లేదు. అందువల్ల అక్కడున్న ఇళ్ళన్నీ గూడుగట్టుకొన్న శోకంలాగే కనిపిస్తాయి. ఉప్పుతిని రాలిపోతున్న మట్టి గోడలతో, తాటిమట్టల పైకప్పుతో అశోకపురానికి పెట్టని ప్రాకారంలా పరివేష్టించి వున్న గుడిసెల నడుమ కొన్ని పెంకుటిళ్ళు వున్నాయి. ఆ ఇళ్ళల్లో ఒకటి యిప్పుడు ఖాళీగా వుంది. దొడ్డి తలుపు తెరిచి అవతలికి తొంగి చూచావంటే నేల యీనినట్టుగా ఒక వంద గుడిసెలు కనిపిస్తాయి. తమ కోళ్ళతో, తమ కుక్కలతో, తమ బిడ్డ పాపలతో అనాధులైన ఏనాది వాళ్ళెవరో ఆ గుడిసెల్లో నివసిస్తారు. అక్కడ నిల్చోలేక వీధిగుమ్మంలోకి వచ్చి నిల్చుంటావనుకో. అక్కడ కనిపించేవైనా ఏమంత ఉల్లాసకరమైన దృశ్యాలు గావు. నువ్వెప్పుడూ ఉతికిన బట్టలే కట్టుకుంటావు. శుభ్రంగా తల దువ్వుకుంటావు. ముచ్చటగా బొట్టుపెట్టుకుంటావు. శరీరాలంకరణ విషయంలో ఈ వీధి ఆడవాళ్ళకు నీ కున్నంత ఓపరికం వున్నట్టు లేదు. వీళ్ళు ప్రొద్దస్తమానం ఏదో ఒక పని చేయడమే చేయడం! ఎందుకు బ్రతుకుతున్నారో బ్రతకడమే బ్రతకడం!

పోగా, నేను చెప్పిన రెండో యిల్లుంది చూచావా నీరజా? అది బజారు కవతల పూలంగి తేరు వీధిలో వుంది. పేరుకు తగ్గట్టుగా అక్కడి యిళ్ళన్నీ పూలంగి తేరులా వుండడం ఆ వీధి ప్రత్యేకత. కొయ్య ముక్కనేది కంటికి కనిపించకుండా సిమెంటుతో కట్టిన కట్టడాలు, చుట్టూరా పచ్చటి పూల మొక్కలు, ప్రాణాలకు హాయిగొలిపే గృహాంతర్భాగాలు, ద్వారం దాటుకోగానే పాదానికి మెత్తగా తగిలే తివాచీ, కూచోడంలోని సుఖాన్ని ఎరుగుదువా అంటూ ప్రశ్నించేటట్టున్న సోఫాసెట్లు, గాజు కుండీల్లో తాజా పువ్వులు, సన్నగా వినవచ్చే రేడియో సంగీతం – ఇన్ని మాటలెందుకు? మనబోటివాళ్ళం గనుక లోపలికి వెళ్తే ఉన్నట్టుండి వేరొక లోకానికి వచ్చేశామేమోనన్న భ్రమ కలగక మానదు. ఇంతలో ద్వారబంధానికి వ్రేలాడుతున్న తెర ఏదైనా ప్రక్కకు తొలగి, అతివ ఆకారం ఒకటి ఈవలికి కనిపిస్తే నువ్వు నమ్ముతావో నమ్మవోగానీ నీరజా, మన కళ్ళు జిగేల్‌మనే వెల్తురు తాకిడికి రెపరెపలాడక తప్పదు. ఆ అతివ ముఖం రాకేందుబింబంలా వుంటుందని నేను చెప్పడం లేదు. (ఉండవచ్చు, ఉండకపోవచ్చు.) ఆవిడ చెవులు శ్రీకార సన్నిభాలని నేను చెప్పను. (అవునో కాదో తెలిస్తే గదా చెప్పడానికి? కంఠం శంఖంలా వుంటుందని నిక్కచ్చిగా చెప్పలేను. ఇంతకూ నేనిక్కడ చెప్పదలచింది, చెప్పవలసింది ఆ

కనిపించే కాంతామణి శరీర లక్షణాలను గురించి కాదు – ఆమె ఒంటిని ఆశ్రయించుకున్న ఆభరణాలను గురించి. కమ్మలా, కర్ణకుండలాలా, నెక్లెసులా. చంద్రహారాలా, ఒంకీలా, ఒడ్డాణాలా, రత్నకంకణాలా, రవ్వలు పొదిగిన ఉంగరాలా, ఎలా చెప్పను?' ఎన్నని చెప్పను? పేరు పేరునా అన్నింటి పేర్లు చెప్పడానికి నేనేమైనా నగలకొట్లో కాటలాగులు కంఠోపాఠం చేశానా? ఐదేండ్ల సాంసారిక జీవనంలో కట్టుకున్న పెళ్ళానికి పట్టుమని పదికాసులతో ఒక నగచేసి పెట్టలేని నేనెంత, నా పరిజ్ఞానమెంత? ఇంతకూ చెప్పొచ్చేదేమంటే, యిలాంటి అసూర్యంపశ్యలకు అలవాలమైన వూలంగి తేరు వీధిలో వసంతనిలయం అంటూ ఒక సౌధం వుంది. ఆ తాలూకు అవుట్ హవుసే నేను మన కోసం చూచిన రెండో యిల్లు. 'చూడ చూడ వేడుక' అన్నమాట నువ్వెప్పుడైనా విన్నావా నీరజా! ఆ మాట ఈ అవుట్ హవుసుకు వర్తిస్తుంది. ఒక చివర చిన్న స్టోరు రూము. మధ్యలో హాలు. మూడోగదిలో సగం వంటకు, సగం స్నానానికి రెండు భాగాలు. ఇనప్పెట్టెలోనైనా మనకంతటి భద్రత లభించదు. పెరటికోసం యిల్లు దాటనక్కరలేదు. వీధిలో జరిగే రణగొణ ధ్వనులు నీ చెవిలో పడవు వెన్నెలొస్తే చక్కా ఆరుబయట పడుకోవచ్చు. చలికాలమైతే తలుపులు బిడాయించుకోవచ్చు. ఎండాకాలపు రాత్రుల్లో నైతే మిద్దెపైకి వెళ్ళిపోవచ్చు. హేమంతరాత్రుల సంగతి సరేసరి! సర్వకాల సర్వావస్థలకు అనువైన ఈ దివ్యోపమందిరం బహుశా మనకోసమనే నిర్మించబడి వుండాలి. నాకలా అనిపించింది మరి! చూచావంటే నీకైనా అలా అనిపించకపోదు.

పనిలో పనిగా నేను చూచిన మొదటి యింటిని గురించి యిక్కడ మరికొన్ని సంగతులు చెప్పేయడం మంచిది. ఇప్పుడశోకపురమనే ఈవాడ నెలకొనివున్న చోటు పూర్వం ఒక చెరువు కడుపై వుంటుందని నా అనుమానం. గోడల్లో నుంచి గూడా చెమ్మ తొంగి చూస్తూవుంటే యిక నేలపైన పడుకునే ఆశ ఎక్కడిది? తలుపు తెరచి లోపలికి చూసేసరికి పైకప్పుతాలూకు పెంకులు కొన్ని క్రింద నేలపైన కనిపించాయి. ఇది కప్పుతో స్థిరనివాసం చేస్తున్న మూషిక రాజాల పనట! ఇంటియజమాని చెప్పాడు. ఏమో, ఎవరు చూచారు? ఆ పెంకుల్లో అంతకంటే అపాయకరమైన ప్రాణులు కాపురం చేయడంలేదన్న గ్యారంటీ ఏముంది? ఈ ఉపద్రవాలకన్నింటికీ తలమానికంగా అశోకపురంలో దొంగల భయం హెచ్చట. నిజమే కాబోలు ననిపించింది. ఎందుకంటావా ఈ వాడలో ఒక వ్యక్తి ముఖం చూచి ఇతడు లేదా ఈమే దొంగ కాదని చెప్పగలమా? సాధ్యంకాదు. నేను క్యాంపుకు వెళ్ళినా నా ఆఫీసులో ఇన్‌స్పెక్షన్ జరుగుతున్నా ఒంటరిగా ఇంట్లో వుండవలసినదానివాయె? ఆలోచించు.

ఇప్పుడిక నేను నీ అభిప్రాయంకోసం వేచివుంటాను. ప్రత్యుత్తరంరాగానే నీవు కోరుతున్న యింట్లో మన కాపురం సర్దుబాటుచేసి నీ రాకకోసం నిరీక్షిస్తూ వుంటాను.

"ఉందునా మరి...."

ఏమాట కామాటే చెప్పుకోవాలి. మాటకు మాట బదులివ్వడంలో ఎంతటిదిట్టో ఉత్తరానికి బదులు వ్రాయడంలోనూ అంతే ప్రాంప్ట్ మా నీరజ! ప్రత్యుత్తరమైతే నాలుగు రోజుల్లోనే వచ్చింది. కాని అది నేనాశించిన జవాబు గాదు. ఒకటే ప్రశ్నకు నాలుగు జవాబులు సరఫరా చేసి, అందులో ఒకటి మాత్రం ఎన్నిక చేయమనే పరీక్షా విధానం ఒకటుందని తమరెరుగుదురుగదా! నా ప్రశ్నకు నేనిచ్చిన జవాబులు రెండే! అందులో ఒక్కటి మాత్రమే కరెక్టని నా అంతట నేను బాహాటంగానే సూచించి వున్నాను. కానీ,

ఎన్ని విద్యలు అవలీలగా నేర్చినా నారీ హృదయాన్ని అర్థం చేసుకునే బ్రహ్మవిద్య మాత్రం మగవాడి పాలిటికి దుస్సాధ్యంగానే వుండిపోయింది. నా అంచనాను త్రిప్పికొడుతూ మా ఆవిడ నేను చూచిన మొదటి ఇంటినే సెలక్టు చేసిపారేసింది.

ఏం చేస్తాడు భవదీయుడు, అశోకపురంలోని శోకగృహంలో అలకపాన్పుకు బదులుగా నులక మంచం సవరించుకుని యింత చేశావా యింతీ అని విచారించడం మినహా!

ఇలా నా పాటుకు నేను విచార దినాలు గడుపుతుండగా శ్రీమతిగారు బయల్దేరి వస్తున్నట్టు వార్త అందింది. రిసీవు చేసుకోవడానికి బస్‌స్టాండుకు వెళ్ళాను. మాతృశ్రీ సమేతంగా, తన మాతృత్వానికి చిహ్నంగా వున్న చిరంజీవులతోబాటుగా బోలెడు సామానుతో సహా నీరజ బస్సు దిగింది.

"ఈ వూళ్ళో జట్కాలు లేవు" అన్నాను.

"ఫరవాలేదు లెండి, నడిచే వెళ్ళిపోదాం. మేము చెరొక బిడ్డను తీసుకుంటాం మీరు సామాన్లు పట్టించుక రండి..."

ఇంకా నయం. నన్నే ఎత్తుక రమ్మనలేదు.

నిజంగా చెప్పొద్దూ! బిడ్డలెంత ముద్దొస్తున్నా నీరజపైన నాకు చెప్పరానంత కసిగా వుంది? ఇప్పుడేమయింది? అమ్మగారి తమాషా అంతా ముందేవుంది. మిడిగ్రుడ్లుపెట్టి అరచేతిని నోటికడ్డం పెట్టుకొని ఈవిడగారు హాహారవం చేయవలసిన పద్ధతి అదే! గడిచిన పది పదిహేను రోజులుగా నేను పని గట్టుకుని నా ప్రస్తుత నివాస గృహాన్ని క్రయిమ్ పిక్చర్లో భూతగృహం సెట్టింగులా దిద్దితీర్చివున్నాను. బూజు దులపలేదు. సాలిగూళ్ళు తీసెయ్యలేదు. వెదికిపట్టిన ప్రతి నల్లినీ గోడపైకి తీసుకెళ్ళి మరకలు సృష్టించాను. పొగచూరిన గోడలకు యింటి యజమాని సున్నం కొట్టిస్తానంటే వద్దన్నాను. దొడ్డిని అడివిలా వుండిపోనిచ్చాను.

కానీ నీరజ దగ్గిరికి వచ్చేసరికి ఈ నా రెండో అంచనా గూడా మందుదట్టించని టపాకాయలా తుస్సుమంటూ వెలవెల పోతుందని నేను కలలోనైనా భావించలేదు.

అటూ ఇటూ నాలుగుసార్లు తిరిగి ఇల్లంతా కలయపరకించిన నీరజ మెల్లగా నా దగ్గిరికి వచ్చి "నేనెలా వుంటుందనుకున్నానో అలాగే వుందండీ యిల్లు" అంది.

"ఇది నువ్వు వలచిన రంభ. ఇది నువ్వు మునిగిన గంగ. ఇదిలా వుండడంలోగానీ, యిందులో మనముండడంలోగానీ నా ప్రమేయమేమీ లేదు." అన్నాను.

నా వుడుకుమోత్తనం చూచి నీరజకు నా పట్ల జాలి అయినా కలిగి వుండాలి, లేదా ప్రేమైనా యినుమడించి వుండాలి. ఆమె గోముగా నా సరసకు వచ్చి చెంపపైన చేయివేసి నన్ను తన వైపుకు త్రిప్పుకుంటూ "కోప్పడకండీ! మనమేం ఎల్లకాలమూ యిక్కడే వుండబోతామా? టెంపరరీగా యిదొక మజిలీ! నేను చెబుతున్నానుగా! త్వరగానే వెళ్ళిపోదాం" అంటూ అనునయించింది.

"ఏమన్నావు నీరజా! ఇదొక మజిలీనా? మరైతే మన గమ్యస్థానం ఏది?" ఉత్కంఠతో ప్రశ్నించాను.

"కంగారు పడకండి. నెక్స్టు మజిలీయే మన గమ్యస్థానం?"

నాకర్థం కాలేదు తెల్లబోయాను. నన్ను అమాయకుణ్ణి చేసి పారేసినందుకు మురిసిపోతున్నట్టుగా నీరజ నవ్వింది. ఆ గొడవలో పడి మజిలీల విషయం విస్మరించాను.

ఆ రోజు రాత్రి బిడ్డలిద్దరూ నిద్రపోయిన తరువాత, తన తల్లి సినిమాకు వెళ్ళిన అదను చూచుకుని నీరజ అప్పటికప్పుడు యింట్లో ఒక చిన్న బెంచీ కోర్టులాంటి దాన్ని

ఏర్పాటు చేసి నన్ను ముద్దాయినిగా నిల్చోబెట్టింది. తాను న్యాయమూర్తిగా మారిపోయి విచారణ ప్రారంభించింది:

"ఏమండీ! ఓ విషయం అడగాలి మిమ్మల్ని..."

"అడుగు, నిరభ్యంతరంగా అడుగు..."

"నేను మా పుట్టింటికి వెళ్ళి ఎంత కాలమైంది?"

"కానుపు కింక మూడు మాసాలుందనగా వెళ్ళావు. కానుపైన తర్వాత మూడు నెలలకొచ్చేశావు."

"నేనింటి దగ్గర లేనప్పుడు మీకు మామూలుగా నెల ఒకటింటికి ఎంత ఖర్చవుతుండేది?"

"ఎంతో ఎందుకవుతుంది? వంద రూపాయలతో సరిపోయేది.."

"మీ లెక్కప్రకారం నెలకు నూటయాభై మిగిలినట్లే గదా! నూట యాభైని ఆరు పెట్టి గుణించడండి...."

"గుణించాను."

"మా నాన్నగారిచ్చిన డబ్బుంది. నేనొక నూరిస్తాను. కలుపుకోండి...."

"అయింది."

"ఏమిటి?"

"కూడిక."

"ఆ వెయ్యి రూపాయిలూ పట్టుకెళ్ళండి. ఎంత బంగారం వస్తే అంత కొనండి. రెండు పేటలతో నాకో గొలుసు చేసి పెట్టండి..."

మంచిమాట ఎవరు చెప్పినా వినవలసిందే! కాంతను కనకంతో అలంకరించడం గూడా సాంప్రదాయమే! ఐనా ఒక సందేహం. నా ప్రవర్తన కీయిచ్చి వదిలిపెట్టిన తర్వాత కీ అయిపోయేదాకా పరుగెత్తే బొమ్మ మోటారులా వుండడం లేదుగదా!

ఒక పని భారమయ్యేదిగానీ, కాకపోయేదిగానీ, వాడివాడి జీవన స్థాయిని బట్టి వుంటుంది. మా ఆవిడ పురమాయించింది నా పాలిటికి భారీ వ్యవహారమే. అనుభవజ్ఞులతో సంప్రదించాను. హెచ్చరికలు మనోగతం చేసుకున్నాను. దగ్గర్లో వున్న టౌనుకు వెళ్ళి బంగారం కొన్నాను. పొందికగా నగ చేసి పెట్టే బత్తుడి కోసం వాకబు చేశాను. అలాంటివాడొకడు పొరుగూళ్ళో వున్నట్టు తెలిసింది. అతని దగ్గరికి వెళ్ళడానికి మధ్యవర్తి ఒకరు కావలసి వచ్చింది. ఇలా బంగారు గొలుసు తయారీ అయిదారునెలల ప్రణాళికగా పరిణమించింది.

ఈలోగా కొత్తనీళ్ళు ఒంటికి పట్టక యింటిల్లిపాదీ ఒకసారి జబ్బుపడి లేచాము. మొదట మూడేళ్ళ చంటివాడికి జలుబు చేసింది. మూసిన కన్ను తెరవకుండా మూడు రోజులపాటు ముమ్మరంగా జ్వరం కాసింది. నేను గానీ, నీరజ గానీ పెళ్ళిగాక మునుపు పసిబిడ్డలతో వేగినవాళ్ళం కాము. కనీసం 'బిడ్డలపెంపక' మన్న పుస్తకమన్నా చదువుకోలేదు. మాకన్నీ అనుమానాలే! ఒకసారి బిడ్డకు పొరబోయి గ్రుడ్లు తేలవేసేసరికి నీరజ భోరుమని ఏడవసాగింది. అంతవరకూ కాస్తా ఎడమెడంగా వున్న ఆ వీధి ఆడవాళ్ళందరూ బిలబిలా యింటి లోపలికి వచ్చేశారు. ఒకావిడ బిడ్డను చేతుల్లోకి తీసుకుని నిముషంలో సముదాయించేసింది. ఇంకొకావిడ వూయెల్లో వేసి నిద్ర వూపింది. 'అయ్యో, యిదేం చోద్దెమమ్మా! బిడ్డకు పొర పోదా ఎక్కడైనా! అంత మాత్రానికే ఏడ్చేస్తారా?' అనుకుంటూ

వరుసగా అందరూ ఒకసారి విసుక్తుపోయారు. జ్వర తీవ్రతలో బిడ్డకు నెమ్మదిగా నిద్రపట్టేదికాదు. మేలుకుని వున్నప్పుడు కాళ్ళపైన పడుకో బెట్టుకుని మెల్లగా తడుతూ వుండకపోతే ఏడుపు లంకించుకునేవాడు. అప్పట్లో ఎదురింటి తులసమ్మ, లేదా నాలుగో యింటి కామాక్షమ్మ, కాదా ప్రక్కింటి అప్పలమ్మ ఎవరో ఒకరు నీరజకు సాయం వచ్చేసేవారు. బిడ్డ తల్లిని వదిలి పెట్టకపోతే తామే స్వయంగా వంట పనికి పూనుకునేవారు. మంచిదో, చెడ్డదోగాని ఈ వాడ మనుషుల్లో ఒక గుణం వుంది. ఎవరి గొడవలు వాళ్ళే పడనీలెమ్మని వాళ్ళూరుకోరు. నీ ఆనందంలో గానివ్వు దుఃఖంలో గానివ్వు ఆహ్వానం లేకపోయినా వచ్చి పాలు పంచుకుంటారు. 'ఏం చేస్తున్నావమ్మా నీరజా? మార్కెట్టుకు వెళ్తున్నాను గానీ కూరగాయలేమైనా కావలసివస్తే చెప్పు, తెచ్చి పడేస్తాను' అంటూ ఒకావిడ నేరుగా యింటికే వచ్చి పలకరించి వెళుతుంది. 'వంట చెరకు అయిపోయినట్టుందే! తెచ్చి పడెయ్యమంటావా అక్కయ్యా?' అంటూ పొరుగింటి కుర్రవాడు యథోచిత సహాయం నెరపడానికి ముందుకొస్తాడు. ఇంతలో ఇంటి వెనుక వైపున వున్న ఏనాదివాళ్ళ ఆడవాళ్ళు కొందరితో నీరజకు పరిచయం ఏర్పడింది. వాళ్ళామెగారిని పిండి రుబ్బనివ్వడం లేదు. చివరకు అంట్లుగూడా వాళ్ళే తోమిపెడుతున్నారు. హఠాత్తుగా నీరజకొక సందేహం కలిగింది. "ఏమిటండీ! నేనిప్పుడుండటం పుట్టింట్లో కాదుగదా! ఏమిటో మరి, ప్రాణాలకెంతో హాయిగా వుంది." అంటూ ఆశ్చర్యం ప్రకటించింది. నా మట్టుకు నేను నా ఆశ్చర్యాన్ని బయటికి వెల్లడించలేదంతేగానీ, ఆఫీసుకు వెళ్ళి రావడమొక్కటి తప్పితే నాకు గూడా అత్తగారింట్లో వున్నట్టే వుంది!

ఈ వ్యవధిలో మా చిరకాల స్వప్నం కాస్తా ఫలించింది. బంగారు గొలుసు నీరజ మెడలోకి వచ్చేసింది. ఆ రోజు మా కుటుంబానికి నిజంగా ఒక పండగ లాంటిదే! కొత్త పెళ్ళికూతుర్ని చూడ్డానికి వచ్చినట్టుగా వచ్చారు జనం! 'పచ్చి పసుపు కొమ్ములా వుంది గదా! అప్పటమైన బంగారానికి అదే గుర్తు' అన్నారు. పనితనాన్ని మెచ్చుకున్నారు. ఆ నగవల్ల నీరజ కంఠానికి ఎక్కడలేని అందం వచ్చిపడిందన్నారు. పుత్రోత్సాహమా? కొత్తగా ఒక నగ చేయించుకోవడమా? ఏది ఎక్కువ ఆనందప్రదం? ఏమో నేను చెప్పలేను.

అలా గడిచింది ఒకటి రెండు రోజులే! మూడో నాటి సాయంకాలం నేనింటికి వచ్చేసరికి దిగులు నీడలు పొరాడుతున్న ముఖంతో నీరజ గుమ్మంలోనే నా కెదురైంది.

నా మనసు గతుక్కుమంది. మెడవైపు చూచాను. పరవాలేదు. గొలుసు పదిలంగానే వుంది.

"ఏం జరిగింది నీరజా, ఎందుకలా వున్నావు" అని ప్రశ్నించాను.

"ఎంతటి ప్రమాదం తప్పిందనుకున్నారు! గుండెలవిసి పోయాయంటే నమ్మండి. స్నానం చేస్తూ గొలుసు తీసి జామచెట్టు కొమ్మకు తగిలించాను. ఏనాదివాళ్ళ అమ్మాయి లేదూ, సుబ్బులు - అది నీళ్ళు చేదడానికి వచ్చింది. దానికేవో పనులు పురమాయించి చక్కా లోపలికొచ్చేశాను. విస్తరివేసుకుని నింపాదిగా భోజనం చేస్తూ కూర్చున్నాను. 'అమ్మగోరూ!గొలుసు చెట్టు కొమ్మకే వుంచేశారేమండీ?' అంటూ ఆ పిల్ల తీసుకొచ్చి ఇచ్చేదాకా నాకా విషయమే జ్ఞప్తిలో లేదు..."

"చూశావా నీరజా! ఎప్పుడూ ఎక్కనివాడు అందలమెక్కితే ఇలాగే ఏదో అయిందట! పోనీలే. ఇకనయినా జాగ్రత్తగా వుండు" అన్నాను.

"వద్దు బాబూ వద్దు! ఏ వేళ కెలా వుంటుందో చెప్పలేం. ఎందుకురా ఇదిలా చెబుతోంది అనుకోకుండా మీరు చప్పున వేరే యిల్లు చూడండి. వెంటనే వెళ్ళిపోదాం..."

"అబ్బే, ఎందుకులే నీరజా! ఈ యింటిని గురించి ఏవో దురభిప్రాయాలుండిన మాట నేను కాదనను. కానీ అవన్నీ యిప్పుడు మాసిపోయాయి. ఇక్కడి కొచ్చాక చీకూ చింతా లేకుండా నిశ్చింతగా వున్నాము. కొత్త నగ గూడా చేయించుకున్నాము. చిటికెలో మటుమాయం కావలసింది, మళ్ళీ మన చేతిలోకి వచ్చింది గూడా!...."

"కాదులెండి బాబూ! మీకు తెలియదు, నేను మొదటి రోజునే మీతో చెప్పానుగా! ఇది తాత్కాలికంగా ఒక మజిలీయే! మరొకటి, మరొకటీ మనకొద్దు ఆ పూలంగి తేరు వీధిలోనే ఓ యిల్లు చూడండి..."

"ఆ వీధిలోనా?" ఆవిడ యింగిత మేమిటో తెలియక తెల్లబోయాను.

"ఇప్పుడు నా మెడ బోసిగా లేదుగదా? పరవాలేదు లెండి! మనమిప్పుడు భేషుగ్గా అక్కడే కాపురం పెట్టొచ్చు..."

తెలిసింది. బంగారపు గొలుసనేది నీరజ కంఠానికి అలంకారం మాత్రమేగాదు, నా ప్రయోజకత్వానికి గుర్తుమాత్రమేగాదు, అది పూలంగి తేరు వీధిలోకి ప్రవేశపత్రం గూడా!

"ఒక్కొక్కతరి జవరాండ్రు కటారికత్తియల్" అన్నాడు కవి. నా దృష్టిలో వాళ్ళెప్పుడూ కటారి కత్తులే! వాళ్ళొక సలహా చెబుతారు. అది నీకు నచ్చదు, ససేమిరా ఒప్పుకోవు, కానీ, అలా ఎంతో కాలం గడవదు. అయిదు రోజులకో, ఆరు రోజులకో నువ్వు కాస్త మెత్తబడతావు. ఇంకొక ముహూర్తంలో ఎప్పుడో 'కానీలే చూద్దాం' అంటావు. మళ్ళీ కొద్దిరోజులు గడిచేసరికి కాంతామణి కోరిక ఏదైతే వుందో దాన్ని నెరవేర్చే ప్రయత్నంలో గొంతుబంటిదాకా మునిగి పోయివుంటావు.

ఉదాహరణకు నా విషయమే తీసుకోండి. నెల తిరగకమునుపే నేను అద్దె యింటికోసం అన్వేషిస్తూ పూలంగి తేరు వీధికి బయల్దేరాను.

అదృష్టం కలిసొచ్చినట్టుగా నాలుగైదు నెలలు మునుపు నేను చూచివచ్చిన అవుట్ హౌస్ యింకా ఖాళీగానే వుండిపోయింది. ఇంటి యజమాని జరిగిపోయిన విషయాలను గురించి అట్టే పట్టించుకునేవాడిలా లేడు. "మీరా! వచ్చేశారా! మంచిది. నిరభ్యంతరంగా మీరీ యింట్లోకి రావచ్చు. అన్నట్టు చిన్నబిడ్డలే అన్నారు కదూ! వాళ్ళు గూడా చాలా చిన్నవాళ్ళన్నారు. తోటకేమీ ప్రమాదం లేకుండా ఉండడమే మాక్కావలసింది! తాళం చెవులు యింటిదగ్గరే యిచ్చివుంటాను. మీకెప్పుడిష్టమయితే అప్పుడే చేరవచ్చు" అన్నాడు.

కొత్త యింటిలో కాపురాన్ని గురించి తలచుకున్న కొద్దీ ఎంత ఆనందంగా వున్నా, నాకు లోలోపల ఒకందుకు బాధ గూడా లేకపోలేదు. తోటలో ఒకకొయ్య నాటిపెడితే తీగలు కొన్ని అల్లిబిల్లిగా దాని కల్లుకుంటాయి. మళ్ళీ వాటిని వేరుచేయడం మనసుకెంతో బాధ కలిగించే సన్నివేశం. ఈ మాటలోని నిజాన్ని మరింత బాగా అనుభూతిలోనికి తెచ్చుకోదలచినవారు శకుంతలను అత్తవారింట్లోకి పంపిన నాటి కణ్వాశ్రమ దృశ్యాన్ని ఊహలోకి తెచ్చుకోవచ్చు. అశోకపురంలోని యింటిని ఖాళీ చేసిన రోజున అక్కడి యిరుగుపొరుగువాళ్ళను తొలగతోసుకుని ఈవలికి రావడం మా పాలిటికి బ్రహ్మప్రళయమయి పోయింది.

జీవితంలో నుంచి వీలయినన్ని ఎక్కువ సదుపాయాలు పంచుకోదలచినవాళ్ళు విధిగా కొన్ని మానసిక దౌర్బల్యాలను జయించాలి. బంధు ప్రేమను ఎక్కడి కక్కడే తెగ్గోయాలి. పాపభీతి తగ్గించుకోవాలి. మాటపట్టింపు లుంచుకోగూడదు. నీతి, అవినీతి అంటూ

మడిగట్టుకుని కూచోగూడదు. తోడి మానవుల పట్ల మమకారం పెంచుకోవడం అలాంటి దౌర్బల్యమే! అశోకపురం పెంకుటింటిని వదులుకోకపోతే, వసంత నిలయం అవుట్ హవుసులోని సుఖం లభ్యమౌతుందా? అయిదు నెలల మునుపు వాళ్ళెవరో నాకు తెలియదు. నేనెవరో వాళ్ళకు తెలియదు. ఓ పనికిమాలిన అనుబంధాన్ని పెంచుకుంటూ నా మనసెందుకు అశోకపురం వైపు మొగ్గుజూపుతుందో నా కర్థమై చావడంలేదు.

అవుట్ హవుసులో కాపురం పెట్టేశాము.

అవుట్ హవుసులో నుంచి సూర్యోదయం ఎంత అందంగా వుంటుందో చూచాము. వెన్నెల్లో అక్కడి మేడల గోడల, నీడల రామణీయకత తిలకించాము. వసంతం వచ్చి గృహోపవనంలో విడిది చేయడం గమనించాము. గ్రీష్మం వచ్చి పోయింది. వర్షాలు విజృంభించాయి. హేమంతంలో మంచు వానలా కురిసింది. ఋతువుల మూలంగా పుట్టుకొచ్చే అసౌకర్యాలేవీ మమ్మి సోకడం లేదు. అందువల్లనే గావచ్చు, మాకు ఋతువులన్నీ ఒక్కలాగే ఉన్నాయి. అంతా బాగానే ఉందనీ, సుఖమంటే అదేననీ సంతృప్తిపడడానికి ప్రయత్నించాము. కానీ, ఆ సంతృప్తికి వెనక ఏదో తీరని వెలితి దాగొని వున్నట్టు నన్నొక శంక పట్టి పీడిస్తోంది, ఏమిటది, ఏమైవుంటుందది? పని గట్టుకుని రెండు రోజుల పొదుగునా ఆలోచించి చూచాను. స్ఫురించింది. ఉన్న వెలితి అవుట్ హవుసులో మాకాపురానికి సంబంధించింది గాదు. అదిక్కడి మనుషులకు సంబంధించింది. వీళ్ళొకరి యింటి కొకరు వెళ్ళరు. ఎవరి గోడల నడుమ వాళ్ళదొక రాజ్యం. మా మట్టుకు మాకు ఒక ఏకాంత ద్వీపంలో నివసిస్తున్నట్టే వుంది.

ఎవరి యిన్‌వెన్షన్ వాళ్ళే దాచుకుంటే యిక లోకమేం బాగుపడుతుంది? నీరజతో చెప్పేశాను.

ముఖకవళికలను బట్టి చూస్తే నీరజ మారుమాట లేకుండా నా అభిప్రాయాన్ని ఒప్పుకోబోతున్నట్టే తోచింది. కానీ ఒకటే క్షణంలో ఆ ధోరణి మారిపోయింది. "బాగా అన్నారులెండి! మగవాళ్ళు మీకేం తెలుస్తుంది. ఇంటావిడ గిరిజాబాయమ్మ రోజు మార్చి రోజయినా యిక్కడికి వచ్చి వెళ్తుంది. ఆవిడ కోడలు రమాప్రియ పోయిన సోమవారం నాడనుకుంటాను, మన ఇంటికొచ్చింది. నేనూ తీరిక దొరికినప్పుడల్లా వాళ్ళ యింటికి వెళ్ళి వస్తూనే వున్నాను..."

అలాగా! నాకు తెలియదు. పూలంగి తేరు వీధి మహిళా సమాజంలో నీరజకు సభ్యత్వం లభించిందన్నమాట! అంతేచాలు. ప్రస్తుతానికి కదే పదివేలు!

ఈ కొత్త పరిచయాల ప్రభావం మెల్ల మెల్లగా మా కాపురంలో చోటు చేసుకోసాగింది. ఇంటావిడగానీ ఆవిడ కోడలుగానీ ఇంటికొస్తే కూచోడానికొక సుఖాసనమైనా లేకపోతే ఏం చేయగలం? రెండు గాడ్రేజ్ కుర్చీలు తీసుకొచ్చి పడేశాను. ఇంటికొచ్చిన వాళ్ళకు ఉపాహారమైనా పెట్టి పంపకపోవడం ఏం బాగుంటుంది? ఒక డైనింగు టేబిలు కొనుక్కురావడం తప్పనిసరైపోయింది. దీపావళి పండుగకు బట్టలు కొనుక్కు రావడానికి బజారుకు వెళ్తూ ఇంటావిడ తోడుగా నీరజను కూడా తీసుకెళ్ళింది. వట్టి చేతులతో తిరిగిరావడం బాగుండదని నీరజకు ఒంటి రంగుకు సూట్ అయ్యేటట్టుగా డెబ్బయి రూపాయిల్లో ఒక చీర సెలక్టుచేసి డబ్బు నాలుగు రోజుల్లో ఇవ్వొచ్చు లెమ్మని సిఫారసు చేసింది. వస్తూ వస్తూ నీరజ తన చేతవున్న ముప్ఫైరూపాయలు పెట్టి బిడ్డ లిద్దరికీ చెరొక జత రెడీమేడ్ దుస్తులు పట్టుకొచ్చింది. ఇంటావిడ మనమళ్ళు కూడా సరిగ్గా అలాంటి

దుస్తులే తొడుక్కుంటారు. గనుక, నేను పెదవి కదపటానికి వీల్లేకపోయింది. నాలుగు రోజులబట్టి చంటిబిడ్డ సరిగ్గా పాలు తాగడం లేదని చెప్పేసరికి, ఇంటావిడ ఈ కేసును గూడా వాళ్ళ ఫామిలీ డాక్టరుకే రికమండ్ చేసింది. ఆయన చర్మంలోకి ఒక సూది దిగబొడిచి, గుప్పెడు మందు పొట్లాలిచ్చి, అదనంగా పదిరూపాయల ఖరీదుతో ఒక టానిక్కు కొనుక్కోమని, సదరు టానిక్కు దుర్గా మెడికల్ షాపులో దొరుకుతుందనీ సలహా చెప్పి పంపాడు.

ఈ హంగుల కేమొచ్చెగాని, పూలంగి తేరు వీధిలో ప్రత్యేకించి చెప్పుకోవలసిన వైభవం ఆడవాళ్ళు పేరంటాలకు వెళ్ళిరావడం. ఎవరెవరు ఏయే చీర కొనుక్కున్నారో, ఎవరెవరు ఏయే ఆభరణం చేయించుకున్నారో తెలిసి వచ్చేది అప్పుడే. నీరజకున్న మంచి చీరలు ఏ నాలుగో అయిదో మాత్రమే నన్నది ఆ వీధి వనితామండలికొక చర్చా విషయమైపోవడం నా దురదృష్టం. అందువల్ల నాకు కొంత మనశ్శాంతి కరువై పోయింది. రాను రాను ఈ పేరంటమన్నమాట చెవిన బడితే నేను నత్తగుల్లలా ముడుచుక పోసాగాను. ఎందుకంటే, వాటికి రిక్తహస్తాలతో వెళ్ళగూడదట! ఓ జాకెట్టు ముక్క తీసుకెళ్ళాలి. అది రివాజున్నూ, అతిక్రమించరానిదిన్నీ! జాకెట్టుముక్క ఖరీదునుబట్టి దాన్ని తీసుకెళ్ళేవారి అంతస్థుకు ధర కట్టబడుతుంది.

ఈ లెక్కన ఈ అవుట్‌హవుసులో ఇంకొక ఆరుమాసాలు గడిచేసరికి నా బ్రతుకెక్కడ తెల్లవారుతుందో నా వూహ కందడం లేదు.

ఎలాంటి ఆపద వచ్చి చుట్టుముట్టినా ఒక చిన్న కిటుకుతో అందులో నుంచి బయటపడే హీరోలను నేను సినిమాల్లో చూచాను. నా విషయంలో అలాంటి 'మిరకిల్' ఏదైనా జరగకూడదా అనుకున్నాను. 'మిరకిల్'గా చెప్పుకోదగిన గొప్ప సంఘటన ఏదీ జరగకపోయినా, మా కాపురంలో నేనాశించిన మార్పు రావడమనేది వుంది చూచారా? అది నా అదృష్టం!

ముచ్చటగా మూడు మాటల్లో చెప్పి ముగిస్తాను.

ఓ రోజు సాయంకాలం నేనిల్లు చేరుకునేసరికి నీరజ ముఖంలో కత్తి వేటుకు నెత్తురు చుక్కలేదు. ఎన్ని సార్లు గుచ్చి అడిగినా జవాబు లేదు. 'చెప్పు నీరజా! అవమానమయినా, సన్మానమయినా మన ఇద్దరిలో ఒకరికి జరిగితే ఇంకొకరికి జరిగినట్టే గదా? ఫరవాలేదు చెప్పు, చెప్పవూ?' అంటూ బుజ్జగించాను. ఇంకా వెయ్యివిధాలుగా బ్రతిమాలుకున్న తర్వాత నీరజ బయటపడింది.

వాసంతి అన్న పేరుతో ఇంటావిడికో మనుమరాలుంది. ఆ పదేళ్ళ పిల్ల తోటలో పూలు కోసుకుంటూ మా అవుట్ హవుసువైపు వచ్చిందట. 'రా అమ్మాయ్! కాఫీ తీసుకుని వెళ్దువుగానీ' అంటూ నీరజే ఆ పిల్లను ఆహ్వానించిందట. వచ్చిన పిల్ల కాఫీ తీసుకుని తన మానాన తాను వెళ్ళిపోవచ్చును గదా! అలా వెళ్ళిపోకుండా 'నీరజమ్మక్కా! నీ మెడలో వున్న గొలుసు రోల్డు గోల్డుదా? కవరింగుదా?' అని అడిగిందట.

"పెద్దవాళ్ళు చెప్పుకునేమాట గాకపోతే పసిపిల్లకు దానికేం తెలుస్తుందండీ?" వద్దుబాబూ, వద్దు, మనకీ ఇల్లే వద్దు, ఈ వీధే వద్దు" అంటూ వాపోయింది నీరజ.

నీరజకు మరేది కావాలో నాకు తెలుసు.

♦ జ్యోతి మాసపత్రిక - 1969 ♦